క్లుప్తంగా

ఘనంగా ఆలయ పదో వార్షికోత్సవం



భజనలో పాల్గొన్న సత్యసాయి భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆలయ పదో వార్షికోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి వద్ద సత్యసాయి సేవాసదన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు ఓంకారం, సాయి సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 7 గంటల నుంచి 8 గంటల వరకు హారతి కర్పూర హోమం, మధ్యాహ్నం 1గంట నుంచి 3 గంటల వరకు నారాయణ సేవ (అన్నప్రసాదం), రాత్రి 7 గంటల నుంచి సామూహిక భజన, మహా మంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మాన సభ



సన్మాన సభలో పాల్గొన్న అధికారులు

వాంకిడి: మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఎంఈవో మనుకుమార్, నోడల్ అధికారి రాథోడ్ సుభాష్, పదోన్నతిపై వెళ్లిన హెచ్‌ఎం వెంకట రాజయ్యలకు బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. మండలంలో విద్యాభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుత మండల విద్యాధికారి శివచరణ్ కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నటరాజ్, ప్రభోద్ కుమార్, ఉపాధ్యాయులు ధర్మబాయి, రాధ, మౌనిక, రవళి, చైతన్య, శివ, సాయి, మహేందర్, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న కల్యాణం

తిర్యాణి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో స్వయంభూగా వెలిసిన మల్లికార్జున స్వామికి బుధవారం కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో వేముల మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు మార్క శంకర్ గౌడ్, బొల్లం వెంకటేశ్, బుర్ర మధుకర్, బొల్లం శంకర్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తిర్యాణి: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ సూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని గంభీరావుపేట, ఎదులపహాడ్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లోని రిజిస్టర్‌లతో పాటు స్టోర్ రూం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.

నేడు దర్గా భూముల వేలం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో గల సయ్యద్ తాలిబ్ అలీషా బాబ దర్గా భూముల వేలం గురువారం స్థానిక దర్గా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సయ్యద్ తాలిబ్ అలీషా బాబ దర్గా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 10 ఎకరాల చేను, మండలంలోని డోర్‌పల్లి గ్రామంలో ఉన్న రెండు ఎకరాల పొలం రెండు సంవత్సరాల కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వేలంలో పాల్గొనే రైతులు రూ.20వేల అడ్వాన్స్ చెల్లించి పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు దర్గా కమిటీ సభ్యులను 9550 572163, 79811 44110 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'పది' పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షను ఎంఈవో గావుడే హన్మంతు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్ష రాయాలని తెలిపారు. వార్షిక పరీక్షకు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

చిగురిస్తున్న ఆశలు!



రెబ్బెనలో టీస్టాల్ నడుపుతున్న యువకుడు

- రాజీవ్ యువ వికాసం కింద యువతకు రుణాలు
- 15న నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 5 వరకు గడువు
- మార్గదర్శకాలు విడుదల కాక అయోమయం

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు తీపి కబురు అందించింది. స్వయం ఉపాధిలో రాణించాలనే యువతకు సువర్ణ అవకాశం కల్పించనుంది. యువతకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యువత స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు అందించే సబ్సిడీపై స్వయం ఉపాధి రుణాల మంజూరుకు గత ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యతో బాధపడే నిరుద్యోగులకు ఉపాధి లేక తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వచ్చింది. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగా ఉండటంతో చేసుకునేందుకు సరైన పని లేక, స్వయం ఉపాధిలో ముందుకు సాగాలన్నా అందుకు అవసరమైన ఆర్థిక వనరులు లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు రుణాలు అందించాలని నిర్ణయించింది. గతానికి భిన్నంగా పెద్ద మొత్తంలో రుణాలు అందించాలని నిర్ణయించడంతో యువతకు సువర్ణ అవకాశంగా మారబోతోంది.

రూ. 3లక్షల వరకు రుణాలు..

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అనే కొత్త పథకాన్ని తీసుకొస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరేలా పథకాన్ని రూపొందించింది. ఒక్కొక్కరికి రూ. 3 లక్షల వరకు రుణాలు అందించేందుకు రూ.18వేల కోట్లను కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈనెల 15న పథకానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు అదే రోజు నుంచి ఆన్‌లైన్ ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించనున్నారు.

ఉత్తర్వులు రాలేదు

ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ. 3లక్షల వరకు రుణాలు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. కానీ దానికి సంబంధించిన ఎలాంటి ఉత్తర్వులు, మార్గదర్శకాలు ఇంకా రాలేదు. ఉత్తర్వులు రాగానే తెలియజేస్తాం.

– శంకరమ్మ, ఎంపీడీవో

ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి జిల్లా కలెక్టర్లు ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలు అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

స్పష్టత రాక అయోమయం..

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ. 3లక్షల వరకు రుణాలు అందించాలని నిర్ణయించగా ఈ పథకానికి సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవటంతో నిరుద్యోగ యువత అయోమయంలో పడ్డారు. ఈనెల 15 నుంచే దరఖాస్తులను సైతం స్వీకరిస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించగా వయో పరిమితి, విద్యార్హత తదితర విషయాలపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. నోటిఫికేషన్ విడుదల అయితే తప్పా పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియవు. దీంతో రుణాల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. దానికి తోడూ గతంలో ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలను సబ్సిడీపై యువతకు అందించేవారు. ఈసారి ప్రభుత్వం అందించే రుణాలను సబ్సిడీపై అందిస్తారా లేక సబ్సిడీ లేకుండానే అందిస్తారా అనేదీ తేలాల్సి ఉంది.

నాణ్యమైన మొక్కలు అందించాలి



సిర్పూర్(టి): చింతకుంట నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ



పెంచికల్‌పేట్: కొండపల్లిలో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

సిర్పూర్(టి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచి గ్రామాల్లో ప్రజలకు అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని చింతకుంట గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శాలిని ఉన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

పెంచికల్‌పేట్: నర్సరీల్లో మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మండలంలోని కొండపల్లి, లోడుపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఉపాధిహామి పనులు, పంచాయతీల్లోని నర్సరీలు, గొల్లవాడ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో మొక్కలకు ప్రతిరోజు నీటిని అందించాలని సూచించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజుల పనిదినాలను కల్పించాలని ఆదేశించారు. అనంతరం గొల్లవాగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఆర్ఆర్‌వో కాలనీలో గల శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి మహిళలు సామూహిక బోనాలతో ఆలయం వరకు మంగళహారతుల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆలయ బోనాల మహోత్సవాల్లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని పూజలు చేశారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



దామోదర్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల అభివృద్ధికి పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న 1990బ్యాచ్ విద్యార్థి మండోకర్ దామోదర్ విరాళం అందజేశారు. రూ.10వేల నగదుతో పాటు 20 కుర్చీలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నటరాజ్ ఆధ్వర్యంలో దామోదర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ్, సంతోష్, వెంకట్‌రావు, రామారావు, కలీముద్దీన్, మమత, కళ్యాణి, సుహాజన్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బీమాచెక్కు అందజేస్తున్న మేనేజర్ నవీన్‌కుమార్

దహెగాం: మండలంలోని ఐనం గ్రామానికి చెందిన చందన్‌కరి శైలజకు రూ.2 లక్షల బీమా చెక్కు అందజేసినట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శైలజ భర్త నానాజీ 2020లో మృతి చెందారని పేర్కొన్నారు. నానాజీకి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.436 చెల్లించి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో చేరాడన్నారు. నామినీగా భార్య శైలజ బ్యాంకులో సంప్రదించగా బీమా ఉన్నందున ఆమెకు రూ.2 లక్షల బీమా చెక్కు అందించామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సూరిబాబు, వెంకట్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుధవారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో రాణిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన వారికి పోలీసు ఉద్యోగాల్లో ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్డి వరకు రోడ్డు వేయాలని ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కౌటాల: పార్డి వరకు తారురోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ పార్డి గ్రామానికి చెందిన మహిళలు బుధవారం రోడ్డుపై ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ఏళ్లుగా తమ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి రోడ్డు వేయాలని పాలకులు, అధికారులకు విన్నవించామని, ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసి ముత్తంపేట నుంచి కేవలం 2.5 కిలో మీటర్ల వరకు మాత్రమే బీటీ రోడ్డు వేస్తున్నారని తెలిపారు. ముత్తంపేట నుంచి పార్డి గ్రామం 4 కిలో మీటర్ల దూరం ఉంటుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్డి గ్రామం వరకు పూర్తిస్థాయిలో రోడ్డు వేయాలన్నారు. రోడ్డు లేక స్టోన్ క్రషర్ల కంకర లారీల దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు బస్సు కోసం ప్రయాణికుల నిరసన



ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ వెళ్లే మార్గం వైపు సాయంత్రం ఏడు గంటలకు ఉండే ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కొందరు ప్రయాణికులు బస్టాండ్‌లో బస్సులు ఆపి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కెరమెరి, ఝరీ, ధనోరా, వాడిగుడ, కొఠారి నుంచి వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తున్నామని, సాయంత్రం పూట తిరిగి వెళ్లే క్రమంలో బస్సులు లేక ప్రతీరోజు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులకు ఎన్నోసార్లు విషయం తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతీరోజు ఉట్నూర్ వరకు సాయంత్రం పూట ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కంట్రోలర్ పోచంను వివరణ కోరగా కెరమెరికి ప్రత్యేక బస్సు వేస్తామని, అద్దగించిన బస్సులను పంపించాలని కోరగా ప్రయాణికులు అంగీకరించారు. అయితే సంఘటనా స్థలానికి ఎస్సై ప్రశాంత్ చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళన సైతం విరమించారు.

ప్రమాదకర ప్రయాణం..!

- హట్టి ఘాట్‌రోడ్డుపై పిట్టగోడ లేక పొంచి ఉన్న ప్రమాదం
- ఏళ్లుగా పట్టించుకోని వైనం



ప్రమాదకరంగా మూలమలుపు



పిట్టగోడ లేక ప్రమాదకరంగా హట్టి ఘాట్‌రోడ్డు

కెరమెరి: ఎక్కడ ఘాట్ రోడ్డు.. మూలమలుపులు ఉంటే అక్కడ ఇరుపక్కల పిట్టగోడలు నిర్మించాలని నిబంధన ఉన్నా అధికారులకు పట్టించుకోవడం లేదు. ఏళ్లుగా మండల కేంద్రం నుంచి జోడేఘాట్‌కు వెళ్లే దారిలోని హట్టి ఘాట్‌రోడ్డుకు పిట్టగోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. జోడేఘాట్ వచ్చే క్రమంలో పూర్తిగా అరకిలోమీటరు డొనల్ ప్రాంతం కావడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు కుడి పక్కన పూర్తిగా లోయలు ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు లోయలో పడే ప్రమాదం కూడా ఉంది. మరోవైపు ఆ ప్రాంతంతో బీటీ కాకుండా సిమెంట్ రోడ్డు వేసి ఉండడంతో పాటు.. చాలా చోట్ల గుంతలు పడి ఉన్నాయి. అనేక సార్లు అక్కడ వాహనాలు జారిపడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు.

12 గ్రామాలు.. 8 మూలమలుపులు..

మండలంలోని జోడేఘాట్ వైపునకు పిట్టగూడ, టోకెన్‌మోవాడ్, చాల్‌బాడి, పాటగూడ, శివగూడ, లైన్‌పటార్, చిన్న, పెద్ద పాట్నాపూర్, కొలాంగూడ, జోడేఘాట్ తదితర మొత్తం 12 గ్రామాలు ఉన్నాయి. వారు ప్రతినిత్యం పనుల నిమిత్తం కెరమెరికి రాక తప్పదు. ఈక్రమంలో హట్టి ఘాట్ రోడ్డు తప్ప వారికి వేరే మార్గం లేదు. ఈమార్గంలో 8 మూలమలుపులు ఉండగా ఎలాంటి సూచిక బోర్డులు లేవు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్‌రోడ్డుపై పిట్టగోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



చాలా కాలం నుంచి రోడ్డు ఉన్నప్పటికీ హట్టి ఘాట్‌పై ప్రమాద సూచికలు లేవు. పిట్టగోడ కూడా లేకపోవడంతో రాకపోకలు సాగించే వాహనాలు నేరుగా లోయలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

– రాథోడ్ నిరంజన్‌దాస్, బాబేఝరి

భయం.. భయంగా



ప్రజలు భయంతో ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఉంది. మూలమలుపులతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి పిట్టగోడ నిర్మించాలి.

– సిడాం మానిక్‌రావు, శివగూడ

జాజిర్ల సందడి




జిల్లా కేంద్రంలో జాజిర్లు ఆడుతున్న చిన్నారులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామాల్లో చిన్నారుల జాజిర్ల సందడి ప్రారంభమైంది. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో జాజిర్లతో ఆటపాటలతో సందడి చేశారు. గురువారం కామదహనం పురస్కరించుకొని పేడతో తయారు చేసిన దండలను, బత్తీసపేర్లు, కొబ్బరి కుడకలను, జాజిర్లను కామునిలో వేసి దహనం చేయనున్నారు. శుక్రవారం హోళీ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు.

'రింగారిట్'లో సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి: మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. టీఏజీఎస్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘాల నాయకులు బుధవారం వాంకిడి మండలంలోని రింగారిట్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. సరైన రహదారి, వాగులపై వంతెనలు లేవని, మిషన్ భగీరథ నీరు అందక గ్రామానికి దూరంగా ఉన్న బోరింగుపై ఆధారపడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.


స్వామి వివేకానంద సాహిత్య అవార్డుకు ఎంపిక



అభిలాష్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు డా.నూతి అభిలాష్ సాహిత్యరంగంలో విశిష్టమైన ప్రతిభ కనబర్చినందున స్వామి వివేకానంద సాహిత్య అవార్డుకు ఎంపిక చేసినట్లు జోలి పబ్లికేషన్ సీఈవో, సహ వ్యవస్థాపకులు మయాంక్ ఒక ప్రకటనలో తెలిపారు. జోలి పబ్లికేషన్ సంస్థ 2025 సంవత్సరానికి గాను నిర్వహించిన సాహిత్య పురస్కార కార్యక్రమంలో అభిలాష్ తన రచనలతో ఆకట్టుకున్నారన్నారు. సాహిత్య ప్రపంచానికి అతను అందించిన రచనలు గొప్పవని, భవిష్యత్తులో మరిన్ని రచనలు అందించాలని ఆకాంక్షించారు.

పాఠశాలలో గణిత మేళా



బహుమతులు పొందిన విద్యార్థులతో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పై డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణిత మేళాను బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి పట్టు సాధించాలని సూచించారు. అనంతరం మేళాలో పాల్గొని ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, భాషా, గంగాభవాని, ఈశ్వర్, ధన్‌రాజ్, భాగ్య, నాగరాణి, భారతి, లక్ష్మీ, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.